జనవరి నుంచి రేషన్ కార్డుకు సన్నబియ్యం

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు

'కుటుంబ కార్డుల' ద్వారా సంక్షేమ పథకాలు: పొంగులేటి

కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, అక్టోబర్ 16: జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక విషయంలో కమిటీలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ ఎంపికల్లో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అర్హత గల ప్రతి లబ్ధిదారుడికీ ఇల్లు అందాలని అన్నారు. ఖమ్మం రూరల్ మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. సుమారు 8 గంటలపాటు సాగిన ఈ సమావేశంలో గ్రామాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాల్లో కమిటీలుగానీ, అధికారులుగానీ అవకతవకలకు పాల్పడితే సహించబోమని స్పష్టం చేశారు. కమిటీలను రద్దు చేస్తామని, అధికారులను సస్పెండ్ చేస్తామని తేల్చిచెప్పారు. గ్రామాల్లో ప్రజల సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇక నుంచి కుటుంబ డిజిటల్ కార్డుల ద్వారానే సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. మిగిలిన రైతుల రుణాలను కూడా తప్పకుండా మాఫీ చేస్తామని అన్నారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, అధికారులు గణేశ్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, సురేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 16: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అలాగే, అగ్రిమెంట్ సమయంలోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో బుధవారం పర్యటించిన ఆయన.. కేఎంసీ పరిధిలోని 60వ డివిజన్ రామన్నపేట ఎస్సీ కాలనీలో రూ.25 లక్షల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న రెండు లైన్ల కాలువ పనులను నాణ్యంగా చేపట్టాలని, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్, కార్పొరేటర్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి 'పొంగులేటి' రూ.20 వేల విరాళం

బోనకల్లు, అక్టోబర్ 16: మండలంలోని రావినూతల గ్రామంలో నూతనంగా చేపట్టిన చర్చి నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.20 వేల విరాళం అందించారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో చర్చి కమిటీ బాధ్యులకు బుధవారం ఆ నగదు మొత్తాన్ని అందజేశారు. చర్చి అభివృద్ధి కోసం భవిష్యత్‌లోనూ తోడ్పాటు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మండల నాయకులు, చర్చి కమిటీ బాధ్యులు ఉమ్మినేని కృష్ణ, బాగం నాగేశ్వరరావు, ఏనుపోగు ప్రభాకర్, తాళ్లూరి రత్నం, తాళ్లూరి ఏసు, తుడుం ప్రసాద్, తాళ్లూరి సామియేలు, కాంపాటి జాన్, తాళ్లూరి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమీక్ష

వేంసూరు, అక్టోబర్ 16: స్థానిక రైతువేదికలో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పీ రామ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వృత్తి విద్య విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

కారేపల్లి, అక్టోబర్16: కారేపల్లి మోడల్ స్కూల్‌లోని వృత్తి విద్య విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులతో పాటు వృత్తివిద్య కోర్సులను అందిస్తున్నామన్నారు. మోడల్‌స్కూల్ వృత్తి విద్యావిద్యార్థులకు కారేపల్లిలోని శ్రీబాలాజీ అగ్రిమాల్, ఎస్వీ ఫొటోఅండ్ మీడియా స్టూడియోలో శిక్షణ ఇచ్చారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కందకాలు

బోనకల్లు, అక్టోబర్ 16: ఇసుక అక్రమ రవాణా నియంత్రణ కోసం సీపీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు కట్టుదిట్టబైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలోని కలకోట, రాయన్నపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వైరా, మున్నేరుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరగకుండా స్థానిక ఎస్సై మధుబాబు ఏర్పాట్లు చేశారు. మున్నేరు నుంచి ఇసుక రవాణా చేసే మార్గాల మీదుగా వాహనాలు వెళ్లకుండా పొక్లెయిన్‌తో కందకాలను తవ్వించారు. ఇసుక రవాణా చేస్తే ఆ వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

రాయన్నపేట వద్ద రోడ్డుపై కందకాన్ని తవ్విస్తున్న ఎస్సై

వీధులు కావవి.. మురుగు కూపాలు

తిరుమలాయపాలెం పల్లెల్లో మళ్లీ పడకేసిన పారిశుధ్యం

మంత్రులు, కలెక్టర్లు ఆదేశించినా అధికారుల్లో మారని తీరు

ఇటీవలే 'డెంగీ'తో మంచం పట్టిన 110 మంది గ్రామస్తులు

అయినా చలనం లేకుండా వ్యవహరిస్తున్న పంచాయతీ సిబ్బంది

కలెక్టర్ ఆదేశించినా తిప్పారెడ్డిగూడెం పంచాయతీ కార్యాలయం ఎదుట కాల్వల్లో తొలగించని మురుగు

జల్లేపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్డు వెంట నిలిచిన మురుగు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 16: తిరుమలాయపాలెం మండలంలోని పలు పల్లెల్లో పారిశుధ్యం మళ్లీ పడకేసింది. వీధులన్నీ మురుగు కూపాలుగా మారాయి. ఇటీవలే పలు గ్రామాల్లో డెంగీ జ్వరాలు విజృంభించి 110 మందికిపైగా మంచం పట్టిన విషయం విదితమే. మంత్రు లు, కలెక్టర్లు సహా ఉన్నతాధికారులందరూ ఇక్కడి పల్లెల్లో పర్యటించి పారిశుధ్య చర్యలకు ఆదేశించారు. వైద్య శిబిరాలూ పెట్టిన వైద్య సేవలందించారు. ఇప్పుడిప్పుడే కుదుట పడుతుందనుకుంటున్న సమయంలో మరికొన్ని పల్లెల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. 'పల్లెప్రగతి' ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం పల్లెలపై ప్రత్యేక దృష్టి సారించి నిత్యం పారిశుధ్య పనులు చేపట్టడంతో అప్పట్లో అంటు వ్యాధులు, విష జ్వరాల జాడే లేకుండా పోయింది. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ పల్లె పాలనను గాలికొదిలేయడంతో మళ్లీ వ్యాధులు విజృంభిస్తున్నాయి.

పల్లెపాలన అస్తవ్యస్తం..

కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెపాలన అస్తవ్యస్తమైంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. చిన్న వర్షం కురిసినా ఇళ్ల మధ్యనే వర్షపు నీరు నిలుస్తోంది. అంతర్గత వీధుల్లోనూ అదే పరిస్థితి. దీంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు విజృంభించే ప్రమాదం ఏర్పడింది. జల్లేపల్లి, తిప్పారెడ్డిగూడెం, పాతర్లపాడు, జూపెడ, అజ్మీరాతండ తదితర గ్రామాల్లో ఇటీవల అత్యధికంగా డెంగీ కేసులు నమోదై ఇంటిల్లిపాదీ జ్వరాల భారిన పడినపడిన విషయం విదితమే. అప్పుడు మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సహా వైద్యాధికారులు ఆయా గ్రామాలను సందర్శించారు. విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కానీ ఆ తరువాత వారి ఆదేశాలూ బేఖాతరయ్యాయి. ఇప్పుడు తిప్పారెడ్డిగూడెం, జల్లేపల్లి, కేశ్వాపురం, పాతర్లపాడు, బీరోలు, బచ్చోడు, కాకరవాయి, సోలీపురం, వెదుళ్లచెరువు, రమణతండ, ఎర్రగడ్డ, కొక్కిరేణి, తాళ్లచెరువు, పైనంపల్లి, రాజారం గ్రామాలు, వాటి శివారు తండాల్లో పారిశుధ్యం లోపించింది. గ్రామాల్లో ఇప్పటికే పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు.

కలెక్టర్ చెప్పినా కాల్వను బాగుచేయలేదు

మా ఊళ్లో గ్రామ పంచాయతీ ఎదురుగా కొత్తగా మురుగు కాల్వ నిర్మించారు. కానీ ఆ కాల్వలోని మురునీరు ప్రవహించే అవకాశం కల్పించలేదు. ఇటీవలి వర్షానికి వరద నీరు ఇళ్లలోకి పెటెత్తుతోంది. ఫలితంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. అంతకుముందు కలెక్టర్ వచ్చి చూశారు. మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి వెళ్లారు. కానీ పరిస్థితిలో ఏమార్పూ లేదు.

– అచ్చా వీరన్న, తిప్పారెడ్డిగూడెం

విధుల్లో చేరిన 'డీఎస్సీ' ఉపాధ్యాయులు

బోనకల్లు : ఉపాధ్యాయులకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంఈవో

ఎర్రుపాలెం మండలంలో..

జాయినింగ్‌ఆర్డర్లు అందజేస్తున్న ఎంఈవో

మధిర రూరల్/ బోనకల్లు, అక్టోబర్ 16: డీఎస్సీ-2024లో ఎంపికై కౌన్సెలింగ్‌లో నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరుతున్నారు. తమ అలాట్‌మెంట్ ఆర్డర్లను తీసుకెళ్లి సదరు ఎంఈవోలు, హెచ్ఎంలకు అందిస్తూ రిపోర్ట్ చేస్తున్నారు. మధిర మండలానికి 32 మంది ఉపాధ్యాయులు నియామకం కాగా.. బుధవారం 29 మంది రిపోర్ట్ చేసి విధుల్లో చేరినట్లు ఎంఈవో ప్రభాకర్‌రావు తెలిపారు. అలాగే, బోనకల్లు మండలంలో 16 మంది ఉపాధ్యాయులు ఎంఈవో దామాల పుల్లయ్య సమక్షంలో విధుల్లో చేరారు. ఎర్రుపాలెం మండలానికి 68 మంది నియామకం కాగా.. బుధవారం 63 మంది విధుల్లో చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ.. నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. కాగా, మండల కేంద్రంలో సీఆర్‌పీగా పనిచేస్తున్న గవరాజు నాగరాజు సతీమణి ఈదర స్రవంతి ఎర్రుపాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా నియామకం కావడంతో వారిని ఎంఈవో అభినందించారు.

నియామకపత్రాలు అందజేత

కారేపల్లి, అక్టోబర్ 16: డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన 25 మందికి బుధవారం ఎంఈవో జయరాజ్ జాయినింగ్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. నూతనంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు తమ విధుల నిర్వహణలో ఏ మాత్రం అలసత్వం వహించవద్దన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు ఎం.విజయ్, మోతిలాల్ పాల్గొన్నారు.

కారేపల్లి మండలానికి 25 మంది టీచర్లు

కారేపల్లి, అక్టోబర్ 16: కారేపల్లి మండలానికి 25 మంది కొత్త టీచర్లు నియమితులయ్యారు. డీఎస్సీ - 2024 ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ ద్వారా కేటాయించిన పాఠశాలలకు బుధవారం వచ్చి జాయిన్ అయ్యారు. నలుగురు స్కూల్ అసిస్టెంట్లు జాయిన్ కాగా వారికి ఎంఈవో జయరాజు నియామక పత్రాలు అందజేశారు. బాణోతు మంగీలాల్, బాలిక వెంకటరెడ్డి, వాంకుడోతు మంగీలాల్, అజ్మీర వీరునాయక్, ఈర్యానాయక్, పాపాలాల్, దామోదర్ పాల్గొన్నారు.

నిత్యం తాగొచ్చి వేధిస్తున్న కుమారుడు

మద్యం మత్తులో నిద్రిస్తుండగా హత్య చేసిన తండ్రి

కొడుకును హతమార్చిన తండ్రి

రఘునాథపాలెం, అక్టోబర్ 16 : తాగుడుకు బానిసైన కొడుకు నిత్యం ఇబ్బందులకు గురిచేస్తుండడంతో తాళలేక ఓ తండ్రి దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం అర్బన్ పరిధిలోని రామన్నపేట కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఖానాపురం హవేలీ సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన కొంపెల్లి వెంకటేశ్వర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతడికి ఇద్దరు కుమారులు కాగా.. చిన్న కొడుకు గణేశ్(30)కు ఐదేళ్ల క్రితం పెళ్లై ఇటీవలే విడాకులయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన గణేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికొచ్చి తల్లిదండ్రులను హింసించేవాడు. ఈ క్రమంలో కొడుకు వేధింపులు తాళలేక తండ్రి వెంకటేశ్వర్లు గణేశ్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో నిద్రిస్తున్న గణేశ్‌ను తండ్రి పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరుపై ఆరా తీశారు. నిందితుడైన తండ్రిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న నాగేంద్ర బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కొణిజర్ల, అక్టోబర్ 16: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన షేక్ జావిద్(17) బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ నెల 11న రాత్రి బతుకమ్మ నిమజ్జన వేడుకలు చూసేందుకు మిత్రుడి ద్విచక్ర వాహనంపై పగిడేరు వాగు వైపు వెళ్తుండగా తీగలబంజర సమీపంలో రోడ్డుకు అడ్డుగా పడి ఉన్న చెట్టు కొమ్మను ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యారు. దీంతో జావిద్ తలకు తీవ్రగాయాలు కాగా హుటాహుటిన ఖమ్మం అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ జావిద్ మృత్యువాతపడ్డాడు. మృతుడు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా మృతుడికి ఓ సోదరి ఉంది.

పురుగుమందు తాగి యువకుడు..

సత్తుపల్లిటౌన్, అక్టోబర్16: పురుగుమందు తాగి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెరుకుపల్లి పంచాయతీ తురకలగూడెం గ్రామానికి చెందిన పొట్ట పవన్(27) బుధవారం తెల్లవారుజామున పురుగుమందు తాగాడు. ఆపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు గమనించి 108లో సత్తుపల్లికు తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. మృతుడికి ఐదేళ్ల క్రితం కిష్టారం గ్రామానికి చెందిన గోపికృష్ణను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. భార్య కొంతకాలంగా పుట్టింటిలోనే ఉంటుంది. పవన్ మృతిపై స్థానిక పోలీసులు అనుమానస్పదన మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజ్డ్ ఇసుక వేలం

మధిర, అక్టోబర్ 16: రెవెన్యూ, పోలీసు అధికారుల సంయుక్త తనిఖీల్లో సీజ్ చేసిన ఇసుకను మండల అధికారులు బుధవారం వేలం వేశారు. ఇందులో దీనిని రూ.1,73,000కు విక్రయించారు. స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో ఉన్న 143 క్యూబిక్ మీటర్ల ఇసుకకు ఒక్కో క్యూబిక్ మీటరుకు రూ.642 కనీస ధరతో మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు వేలం నిర్వహించారు. మధిరకు చెందిన రామ్‌గంగాధర్ రూ.1,73,000కు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

రఘునాథపాలెం, అక్టోబర్ 16 : యువకుడి అదృశ్యంపై ఖానాపురం హవేలీ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దానవాయిగూడేనికి చెందిన షేక్ యాకూబ్ పాషా(30) ఖమ్మంలోని ఓ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన డ్యూటీకి వెళ్లిన యాకూబ్‌పాషా తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సైదులు పోలీసులను ఆశ్రయించాడు.

మెడిసిన్ విద్యార్థికి ఐప్యాడ్ వితరణ

ఐప్యాడ్ అందజేస్తున్న దృశ్యం

వైరాటౌన్, అక్టోబర్ 16: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మెడిసిన్ సాధించిన బొంతు భగత్‌కు మెడికల్ ఎడ్యుకేషన్‌కు అవసరమైన ఐప్యాడ్‌ను విద్యావేత్త, అనువాదకులు బోడపట్ల రవీంద్ర, వైరా బ్రాహ్మణపల్లికి చెందిన కొంగర సుధాకర్, సింగరాయపాలేనికి చెందిన బేగ్ రోషన్ బుధవారం వితరణగా అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కొణిజర్ల, అక్టోబర్16: రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డు ప్రమాదానికి గురికాగా తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని పల్లిపాడు- కొణిజర్ల గ్రామాల మధ్య చోటు చేసుకుంది. ఎస్సై జీ.సూరజ్ తెలిపిన ప్రకారం.. తనికెళ్లకు చెందిన చల్లా శివకుమార్ (27) తన ద్విచక్ర వాహనంపై వైరా వైపు వస్తుండగా రోడ్డుపై ఉన్న భారీ గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో శివకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడికి భార్య యశోద, పిల్లలు ప్రియ, కార్తీక్ ఉన్నారు.

వేంసూరు మండలంలో వ్యక్తికి..

వేంసూరు, అక్టోబర్16: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గేదె గుద్దడంతో తీవ్రగాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వేంసూరు గ్రామానికి చెందిన అడ్డగట్ల నాగేశ్వరరావు సొంత పనిమీద వేంసూరు నుంచి తొడవరం వైపు వెళ్తుండగా ఎర్రగుంటపాడు వద్ద రోడ్డు పక్కన మేత మేస్తున్న గేదె ఒక్కసారిగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నాగేశ్వరరావును గుద్దడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని సత్తుపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

'నామా' చొరవతో నిధులు మంజూరు

బోనకల్లు, అక్టోబర్ 16: మండలంలోని రావినూతల గ్రామంలో బీసీ, ఎస్సీ, మైనార్టీల శ్మశానవాటికలతోపాటు కంఠ మహేశ్వర దేవాలయాల అభివృద్ధి, నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు వంటి పనుల కోసం నాటి ప్రభుత్వంలో ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు కృషి చేశారు. ఆయన విజ్ఞప్తిపై అప్పటి ప్రభుత్వమే చొరవ తీసుకుంది. దానికి కొనసాగింపుగా కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం కోసం ప్రస్తుత ప్రభుత్వం రూ.4.20 లక్షలను నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఇటీవల ఆ శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నాయకులు కొమ్మినేని ఉపేందర్, ప్రేమానందం, బోయినపల్లి మాధవరావు, ముడావత్ సైదా హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ శాఖ ఏఈగా ప్రభాకర్‌రావు

ఖమ్మం రూరల్, అక్టోబర్ 16: మండలంలోని ఏదులాపురం సబ్ డివిజన్ కోతులగుట్ట సబ్‌స్టేషన్ ఏఈగా జిల్లా ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఏఈగా పనిచేసిన క్రాంతి సిన్హా ఖమ్మం టౌన్-1కు బదిలీ అయ్యారు. ఖమ్మం టౌన్-5గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రావు.. ఏదులాపురానికి బదిలీపై వచ్చారు. ఏఈగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌రావుకు ఏడీ నాగార్జున, ఇంజినీర్ ఈశ్వర్, ఫోర్‌మెన్ కోటేశ్వరరావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచంద్రరావు, జకీర్ షరీఫ్, కనగాల కృష్ణలు శుభాకాంక్షలు తెలిపారు.

మధిర మున్సిపల్ కమిషనర్ బదిలీ

మధిర, అక్టోబర్ 16: మధిర మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న షఫీ ఉల్లా బదిలీ అయ్యారు. ఉన్నతాధికారులు ఆయనను ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. అలాగే, అదే కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్.. మధిర మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.

గ్లోబల్ విస్తాలో వన మహోత్సవం

శ్రీచైతన్య గ్లోబల్‌విస్తాలో మొక్క నాటుతున్న మేయర్ నీరజ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 16 : ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్‌విస్తాలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ పి.నీరజ హాజరై స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. వాతావరణ కాలుష్యం కారణంగా అనేకమంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రతి ఒక్కరం మొక్కలు నాటి వాటిని సంరక్షించి ప్రకృతిని కాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీజీఎం చేతన్‌మాథుర్, ప్రిన్సిపాల్స్ జయసుధ, టీఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రఘునాథపాలెం, అక్టోబర్ 16 : ఖమ్మం నగరం అల్లిపురంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగర మేయర్ నీరజ రైతులకు సూచించారు. బుధవారం అల్లిపురంలో సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.5 వందల బోనస్ అందించడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్ రావూరి కరుణ, వీవీ పాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, ఉపాధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాస్, సంక్రాంతి నాగేశ్వరరావు, ముప్పారపు ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

18న జాబ్ మేళా

మామిళ్లగూడెం, అక్టోబర్ 16 : నిరుద్యోగ యువతకు ప్రైవేటురంగంలో ఉద్యోగాలను కల్పించేందుకు ఈ నెల 18వ తేదీ శుక్రవారం మోడల్ కెరియర్ సెంటర్(ప్రభుత్వ ఐటీఐ టేకులపల్లి) ఖమ్మంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్ల జిల్లా ఉపాధి కల్పనాధికారి మాధవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.11,500 నుంచి రూ.16 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి అవకాశం ఉందని, జాబ్ మేళాలో రిలయన్స్ ట్రెండ్స్, భారతి హూందాయ్ సంస్థలు పాల్గొంటాయని, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా మెకానికల్ చదివిన వారికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 7036902902, 9392922065ను సంప్రదించాలన్నారు.

ఎస్ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి చర్యలు

ఖమ్మం/కొణిజర్ల, అక్టోబర్ 16 : జిల్లాలోని కొణిజర్లలో ఉన్న ఎస్ఏఆర్ మిల్లు ఆస్తుల వేలానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎస్ఏఆర్ మిల్లు యజమాని, కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన ఎం.రామజ్యోతి, భర్త బాలకృష్ణప్రసాద్ ప్రభుత్వానికి 2022-23 రబీ కేఎంఎస్, 2023-24 ఖరీఫ్ సీఎంఆర్ బకాయిలకు సంబంధించి 81కోట్ల 60లక్షల 90వేల 635రూపాయలు బాకీ పడ్డారు. ఈ సొమ్మును తీర్చాల్సిందిగా మొదటి నోటీసు, రెండో నోటీసు ఇచ్చినప్పటికీ స్పందన రాకపోవడంతో ఆస్తులను వేలం వేసేందుకు చర్యలు చేపట్టింది.

ఏఈఎం, సీసీలతో ఎమ్మెల్యే సమీక్ష

సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్, అక్టోబర్16: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం తల్లాడ మండలం ఇందిరాక్రాంతి పథకం ఏపీఎం, సీసీలతో ఎమ్మెల్యే మట్టా రాగమయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుఅంశాలపై చర్చించారు. నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు సన్మానం

సత్తుపల్లి, అక్టోబర్16: సత్తుపల్లి ఆర్టీసీ డిపో ఉత్తమ డిపోగా అవార్డు పొందిన ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా డీఎం రాజ్యలక్ష్మిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందించారు.

విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తులు

మామిళ్లగూడెం, అక్టోబర్ 16 : విదే